క్లుప్తంగా

వైద్య వృత్తి గొప్పది



గురజాల : వైద్య వృత్తి ఎంతో గొప్పదని వైద్యుడు సాయి కర్ణ కుమార్ సూచించారు. స్థానిక వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్ డేను నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఫార్మసీ అనేది మెడికల్ విభాగంలో ఒక ప్రత్యేక పాత్రను పోషిస్తోందన్నారు. అనంతరం వైద్యుడు సాయి కర్ణ కుమార్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వుల్లి సుబ్బారావు, మద్దినేని వెంకటేశ్వర్లు, కళాశాల కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపల్, లెక్చరర్‌లు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు బాలు



పిడుగురాళ్ల: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యమని పలువురు కొనియాడారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో రాఘు సుధా కళా పరిషత్ ఆధ్వర్యంలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఎన్నో పాటలను అద్భుతంగా పాడి బాలు ఎంతో మంది మన్ననలు పొందారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తూముగుంట్ల శ్రీనివాసరావు, సాయి వృద్ధాశ్రమ అధ్యక్షులు ఆత్మకూరి లక్ష్మీ నరసింహమూర్తి, గుండా శ్రీనివాసరావు, జీవీఎస్ మునేశ్వరరావు, ముప్పాళ్ల సాంబశివరావు, కె.వెంకట్రావు, బండ్ల లక్ష్మణరావు, చిన రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు సీసీ కెమెరాలు



గురజాల : గంగవరం గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు సీసీ కెమెరాలను బుధవారం దాతలు అందించారు. గ్రామానికి చెందిన చలవాది శేషగిరిరావు, కూరాకుల రాయప్ప, చలవాది శంకర్ రూ.40 వేలు విలువ చేసే కెమెరాలను ప్రిన్సిపల్ జూపల్లి జ్యోతికి అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలవాది నారాయణ, పాఠశాల చైర్మన్ పేరుపోగు అంజిదేవమణి తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి ఇన్‌చార్జి సర్పంచ్‌గా సరస్వతీబాయి



కారెంపూడి : కారెంపూడి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ రమావతు ప్రమీలాబాయి వ్యక్తిగత కారణాల వల్ల విధులు నిర్వహించలేకపోతున్నానని పేర్కొంటూ బుధవారం ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డికి సెలవు పత్రం అందించారు. ఇప్పటికే ఉప సర్పంచ్ సూరె అంకారావు తన పదవికి రాజీనామా చేశారు. సర్పంచ్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో 15వ వార్డు సభ్యురాలిగా ఉన్న బాణావతు సరస్వతీబాయిని సభ్యులు ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓకు ఎంపీడీఓ నివేదిక పంపారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



కారెంపూడి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న మండలంలోని పెదకొదమగుండ్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మద్దినేని వెంకట కోటయ్యను మండల యూటీఎఫ్ కమిటీ బుధవారం సన్మానించింది. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని కొండపల్లి ఆంజనేయులు కల్యాణ మండపంలో యూటీఎఫ్ మండల శాఖ ఉపాధ్యాయులు వెంకట కోటయ్య దంపతులను సన్మానించారు.

జూదరుల అరెస్టు

సత్తెనపల్లి: పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు సత్తెనపల్లి పట్టణ ఎస్‌ఐ ఎం.సంధ్యారాణి సిబ్బందితో కలసి మంగళవారం దాడులు నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని 31వ వార్డు శివారు పొలాలలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 2,200 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

క్రోసూరు సబ్ రిజిస్ట్రార్‌గా విజయ ప్రసాదరావు

క్రోసూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.విజయప్రసాదరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన డి.భాస్కరరావు పెదకాకానికి బదిలీ అయ్యారు. ఆయనతో పాటు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు.

స్వచ్ఛందంగా ప్రతినబూనదాం



మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ గబ్రూ నాయక్



వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్/కారెంపూడి/మాచవరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని, దీని కోసం అందరూ స్వచ్ఛందంగా ప్రతినబూనదామని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ గబ్రూ నాయక్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం ప్రతి గ్రామంలో విధిగా నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు నిర్వహించాలని చెప్పారు. ఆర్థిక సంఘ నిధులను గ్రామీణాభివృద్ధికి వినియోగించాలన్నారు. స్వచ్ఛతా హీ కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజినీ దేవి, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఏఈలు బాబులాల్ నాయక్, కార్యదర్శులు యల్లబోయిన కోటేశ్వరరావు, బిట్టు వెంకటేశ్వర్లు, ఆవుల వెంకట్రామయ్య, సత్యనారాయణ, బాబునాయక్, సుజాత, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాచవరం మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు

- కారెంపూడి మండలంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలలో బుధవారం మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. ట్యాంకులకు రంగులు వేసి నీటిని క్లోరినేషన్ చేయించారు. పనులను ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, ఎస్‌ఎంసీ కూరాకుల సుబ్బారావు పర్యవేక్షించారు.
- మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు చెత్త, వ్యర్థాల నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. సంపద కేంద్రాల పనితీరును వివరించారు. మంచినీటి ట్యాంకులు, కుళాయిలు, పైపులు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి బి.శ్రీకృష్ణదేవరాయలు, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, సూపరింటెండెంట్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఆటవస్తువుల గది ప్రారంభం

మాచవరం: మండలంలోని మల్లవోలు గ్రామంలో ప్రీ స్కూల్ ఎక్విప్‌మెంట్(ఆట వస్తువులు) గదిని మండల ప్రత్యేక అధికారి బి.శ్రీకృష్ణదేవరాయలు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఆట వస్తువులు, బోధనోపకరణాలు చిన్నారులకు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ప్రసాద్, ఎంఈఓ శ్రీధర్, సీడీపీఓ రుక్సానా, డీసీపీ ఆఫీస్ కన్వీనర్ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కోటేశ్వరి, అన్నపూర్ణ, వెంకటలక్ష్మి, ప్రసన్నకుమారి, అంజలీ, నాగమణి, ఉపాధ్యాయులు రఫీ, మరియదాసు పాల్గొన్నారు.



000

మండల సర్వేయర్‌గా రఘుపతి



మాచర్ల రూరల్: మండల రెవెన్యూ సర్వేయర్‌గా వై.రఘుపతి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ఎండీ జియా వుల్ హక్‌కు తన నియామక పత్రాలను రఘుపతి అందించారు. ఈయన దుర్గి మండల సర్వేయర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన సర్వేయర్ సాల్మన్ ఏడీఏ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సచివాలయ సర్వేయరు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి జింకల ఆదినారాయణ, సర్వేయర్లు మునినాయక్, దుర్గా, చందర్, కోటేశ్వరరావు, శ్రీను, షానా, సంధ్యా, బాలాజి, అంజి తదితరులు రఘుపతిని అభినందించారు.

సస్య రక్షణతో మేలైన పంటలు



రెంటచింతల మండలం మిట్టగుడిపాడులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ బ్రహ్మారెడ్డి



పిడుగురాళ్ల మండలం కరాలపాడులో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయులు

రెంటచింతల/పిడుగురాళ్ల రూరల్: రైతులు అధికారుల సూచనలు పాటించి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని మిట్టగుడిపాడు, గోలి గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తిపంట క్షేత్ర సందర్శన ద్వారా రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుడ్ అగ్రికల్చరల్, ప్రాక్టీసెస్(జీఏపీ), భూసార పరిరక్షణ, భూసార ఆధారంగా పంటలకు ఎరువుల వాడకం, గ్రామస్థాయిలో విత్తనోత్పత్తి, వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రియ వ్యవసాయం వంటి శాస్త్రీయ అంశాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొట్టం ప్రమీలా గురవారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి, వీఏఏలు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు. పిడుగురాళ్ల రూరల్ మండలం కరాలపాడు, చెన్నాయిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉద్యాన వన శాఖ అధికారి వై.మోహన్ ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు.

హైకోర్టు ఏజీపీ శివప్రసాద్‌కు సన్మానం



కారెంపూడి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఏజీపీగా నియమితులైన కూరాకుల శివప్రసాద్‌ను కారెంపూడి మండలంలోని వివిధ గ్రామాల పెద్దలు బుధవారం సన్మానించారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన శివప్రసాద్ హైకోర్టు ఏజీపీగా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఖోఖో జట్ల ఎంపిక

కారెంపూడిష: మాచర్ల నియోజకవర్గ అండర్ 14, అండర్ 17 బాల బాలికల ఖోఖో జట్ల ఎంపికలు బుధవారం పూర్తయ్యాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వచ్చిన 250 మంది విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజకవర్గ జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు జిల్లా స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో ఆడనున్నారు. ఎంపికలను ఐదు మండలాల క్రీడా కో–ఆర్డినేటర్లు ఎక్స్‌మస్ జాన్, బండ్ల ప్రసాద్, కత్తి రవి, వేణు, స్వర్ణరాజు నిర్వహించారు.

సేవా భావమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం

బెల్లంకొండ: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండడమే జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) లక్ష్యమని బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సేవాభావం అంటే వేల రూపాయలు దానం చేయాల్సిన పని లేదన్నారు. మనకు చేతనైన దానిలో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలలో పాల్గొంటే సరిపోతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులైన పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు , పాఠశాలల్ని సొంత ఆస్తులుగా భావించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దేశానికి గ్రామాలు పట్టు కొమ్మలని మహాత్మా గాంధీజీ చెప్పారని ఆమె గుర్తు చేశారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే నిజమైన స్వచ్ఛ భారత్‌ను సాధించగలుగుతామని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి లక్ష్మీ సులోచన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఏడాదికి ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, వై. రమేష్ బాబు, సాంబశివరావు, కుసుమ కుమారి, రత్నకుమారి, సత్యప్రభ, బాలునాయక్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పరివర్తన పాఠశాలకు నిత్యావసరాల అందజేత



సత్తెనపల్లి: పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలకు అమెరికాకు చెందిన పున్నా శ్రీదేవి కుమార్తె అమృత అందించిన రూ. 10 వేలుతో చిలకలూరిపేటకు చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా బుధవారం నిత్యవసర వస్తువులను అందజేశారు. 50 కేజీల బియ్యం, 10 కేజీల కందిపప్పు, 10 కేజీల శనగ నూనె, 30 మంది చిన్నారులకు టవల్స్, స్నాక్స్ అందించారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ సరోజిని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరివర్తన సంస్థకు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ నార్నె జయలక్ష్మి, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ తియ్యగూర రమాదేవి పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల, నవోదయ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్ మాట్లాడుతూ మండలంలో రెండేళ్లు నిండి 19 ఏళ్లలోపు పిల్లలు 8,550 మంది ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ నులి పురుగుల నివారణ మాత్రలను అందజేస్తామని చెప్పారు. పురుగులు ఉండడం వల్ల పిల్లల్లో రక్తహీనత ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రల్ని వారితో మింగించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి, హెచ్ఎం శైలజ, ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్మీదుర్గ, హన్నా కుమారి, శిరీష, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చదనం-పరిశుభ్రతను కాపాడాలి

నరసరావుపేట రూరల్: పచ్చదనం–పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని లింగంగుంట్ల పంచాయతీ కార్యదర్శి కెవి ప్రసాద్ తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామంలోని వీధుల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ సాధించే లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణను చేపట్టాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడే విధంగా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో యాదల మహానందరెడ్డి, ఎం.ప్రభుదాసు, వి.శ్రీరాములు, కొండలు, ఆంజనేయలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం



క్రోసూరు: వైద్యులు రాసిన మందులను అర్థం చేసుకొని సరియైన వాటిని వ్యాధిగ్రస్తులకు ఇవ్వడంలో, చికిత్సలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా బుధవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తున్న ఫాతిమాకు ఆయన సిబ్బందితో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శాంసన్ మాట్లాడుతూ ఫార్మాసిస్టులు వైద్య రంగ వ్యవస్థల్లో అంతర్భాగమని, ప్రజల ఆరోగ్య అవసరాలు తీర్చడంలో వారిది ముఖ్యపాత్రని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జ్యోతి, స్టాఫ్ నర్స్ రాణి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకరరావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వెల్దుర్తి: అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని శిరిగిరిపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు. డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కులను అందించారు. రూ. 30లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యూత్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కుర్రి శివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కళ్ళం రామాంజిరెడ్డి, మందలపు రామకృష్ణ, పులుసు శివారెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, కాళంగి బ్రహ్మయ్య, దిరిశినాల శ్రీనివాసరెడ్డి, జవిశెట్టి వెంకటేశ్వర్లు తహశీల్దార్ రాజశేఖర్ నాయక్, ఏఓ డి.ప్రసాద్, అనిశెట్టి గోపాల్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేబీఆర్

రైతుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

పిడుగురాళ్ల: రైతులు, కౌలు రైతుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం గౌరవ అధ్యక్షులు తెలకపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చెరువు కట్ట బజారులోని 13వ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలకపల్లి మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. అన్నదాతా సుఖీభవ ద్వారా తక్షణం రూ.20వేలు ఇవ్వాలని కోరారు. సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని సూచించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు ధీకొండ వెంకటేశ్వర్లు, చావా కోటేశ్వరరావు, చింతా వెంకట శివరావు, కామిశెట్టి వెంకటేశ్వర్లు, చల్లగుండ్ల వెంకటప్పయ్య, సోమసత్యం, కుంచెపు శ్రీను, కామశెట్టి నరసింహారావు, మద్యం లక్ష్మయ్య, సోమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

దర్జాగా బస్సు షెల్టర్ ఆక్రమణ

- టీడీపీ నేత అరాచకం
- గోడ పగులగొట్టి రేకుల షెడ్ ఏర్పాటు

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు గోడను పగులగొట్టి దర్జాగా రేకుల షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. నాలుగు దశాబ్దాల కిందట మాచర్ల– గుంటూరు రహదారిపై ప్రయాణికులకు అనుకూలంగా ఉండేందుకు ఆర్టీసీ షెల్టర్‌ను ఏర్పాటు చేసింది. రెడ్డిగూడేనికి చెందిన టీడీపీ నాయకుడు మంగళవారం రాత్రి షెల్టర్ గోడను పగలగొట్టి రేకుల షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు. గ్రామస్తులు అడ్డుపడి అడిగినా '' నాఇష్టం.. మీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోండి'' అని బుకాయించాడు.చేసేది లేక గ్రామస్తులు మిన్నకుండిపోయారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఆక్రమదారుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గోడను పగులగొట్టి ఏర్పాటు చేసిన రేకుల షెడ్

సందడిగా అథ్లెటిక్స్ పోటీలు

క్రోసూరు: స్థానిక జెడ్పీ పాఠశాల గ్రౌండ్‌లో బుధవారం పెదకూరపాడు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్– 17, అండర్– 14 బాలబాలికలకు ఖోఖో,అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఏ.రామాంజనేయులు పోటీల్ని ప్రారంభించారు.అండర్– 17 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో అమరావతి ఎస్‌ఆర్‌కే పాఠశాల విద్యార్థి పి. మోబిన్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీడీ శ్రీధర్ తెలిపారు. అండర్ –17 బాలికల పరుగు పందెంలో పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే పాఠశాల విద్యార్థిని ఏ. హన్సిక ప్రథమ, అండర్ –14 బాలుర లాంగ్ జంప్ విభాగంలో అచ్చంపేట జెడ్పీ పాఠశాల విద్యార్థి టి. కళారాజు ప్రథమ స్థానంలో నిలిచాడు. అండర్– 14 బాలికల విభాగంలో నాగవరం జెడ్పీపాఠశాల విద్యార్థిని పి.గంగోత్రి ప్రథమ, అండర్– 17 బాలుర షార్ట్ పుట్ విభాగంలో అచ్చంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఓ.అద్దెయ్యబాబు ప్రథమ, అండర్– 17 డిస్కస్ త్రో బాలికల విభాగంలో అచ్చంపేట కేజీబీవీ పాఠశాల విద్యార్థిని ఎం.కీర్తనబాయి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీడీ శ్రీధర్ తెలిపారు. వీరంతా త్వరలో జరిగే జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారని చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ కో–ఆర్డినేటర్ సి.వి.నాగరాజు , నియోజకవర్గంలో పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరుగుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి

పెదకూరపాడు: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పంట పెట్టుబడి సహాయం రూ. 20వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో బుధవారం కలసి తహసీల్దార్ దానియల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శేషారావు మాట్లాడుతూ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పంట పెట్టుబడి సాయంగా రూ. 6వేలు, రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పేరుతో రూ.7,500 కలిపి మొత్తం రూ.13,500 మూడు విడతలుగా ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం విధించిన నియమ, నిబంధనల వల్ల కౌలు రైతులు పెట్టుబడి సాయాన్ని పొందలేకపోయినట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులందరికీ అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సహాయం రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని తెలిపారు. విధి విధానాలను ప్రకటించి, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలు, వరదలతో నష్ట పోయిన పంటలకు నష్టపరిహారం, బీమా పరిహారం చెల్లించాలని కోరారు. ఈ క్రాప్‌లో నమోదు చేయని పంటలను కూడా గుర్తించి నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ తరగతులు

శావల్యాపురం: స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్ (ఎస్.టి.ఈ.పీ) వారి సారథ్యంలో ఉచితంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు అక్టోబరు 4,5,6 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో–2 పుసులూరి లలితాకుమారి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దసరా సెలవులు సందర్భంగా ఉపాధ్యాయులే వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులుగా కావటానికి ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామం శ్రీరమణారావు– సావిత్రిమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో ఉపాధ్యాయుల కుటుంబ సమేతంగా ఈ తరగతులకు హాజరు కావచ్చునన్నారు. ఈ తరగతుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఉచిత భోజన వసతితో పాటు పార్టిసిపేషన్ ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు డాక్టర్ ప్రత్యూష సూబ్బారావు సెల్‌నంబరు 90306 44440, ధర్మారెడ్డి–8143234555లను సంప్రదించాలన్నారు.